
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 14 ၊ అక్టోబర్ ၊ 2025



సోమశిలలో 74.044 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 74.044 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 9560 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 10,150, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 3800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,27,850
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,560
3 శాతం జీఎస్టీతో	రూ.11,907
సవర (8 గ్రా)	రూ.95,256

గరిష్టం/కనిష్టం 33.8 /26.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సోమవారం గాలిలో తేమ 78 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

17న ఐటీఐల్లో 5వ విడత కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్లు కోసం ఈ నెల 17న 5వ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ కె. శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీలోపు సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐను సంప్రదించాలన్నారు.

డీటీడబ్ల్యూఓగా సుజాత బాధ్యతలు



జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి సుజాత

నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట): జిల్లా గిరిజన సంక్షేమాధికారి (డీటీడబ్ల్యూఓ) కె.సుజాత ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం నగరంలోని కొండాయపాళెం సెంటర్‌లో గిరిజన సంక్షేమ కార్యాలయంలో విధులను చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె పదోన్నతిపై నెల్లూరు జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా బదిలీ అయ్యారు. ఈ శాఖలో ఉత్తమ బాధ్యతలను నిర్వహించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

టిప్పర్ మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించండి



ఆత్మకూరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు: గత నెల 17వ తేదీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం పాలైన ఏడుగురు పేదల కుటుంబాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని కోరుతూ సీపీఎం నాయకులు బాధిత కుటుంబీకులతో కలిసి సోమవారం ఆత్మకూరు ఆర్డీఓ బి.పావనికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ అలసత్వంతో అక్రమంగా ఇసుకను తరలిస్తూ జరిగిన ప్రమాదంలో ఇప్పటి వరకు నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, ఎఫ్ఐఆర్‌లో నమోదైన మిగిలిన వారిని అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. స్పందించిన ఆర్డీఓ ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని తెలిపారు. సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, నాగయ్య, వెంకట్రావు, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి అరుణ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో అన్నదమ్ముల స్థల విషయంలో నిడిగుంట అరుణ వారిని తుపాకీతో బెదిరించిన ఘటనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. పలు కేసుల్లో రిమాండ్లో ఉన్న అరుణను విచారించేందుకు నవాబుపేట పోలీసులు కోర్టు అనుమతితో రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఆస్తి వివాదంలో దౌర్జన్యం చేశారా, తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది, వివిధ కోణాల్లో పోలీసులు విచారణ చేశారు. అయితే అరుణ మాత్రం తనకు తెలియదని, తాను దౌర్జన్యం చేయలేదని పోలీసులకు చెప్పింది. సోమవారం సాయంత్రంతో కస్టడీ ముగియడంతో అరుణను తిరిగి పోలీసులు జైలుకు తరలించారు.

అంపశయ్యపై ఆరోగ్యం

- నాలుగో రోజుకు చేరిన ఆరోగ్యశ్రీ సేవలు స్తంభన

నెల్లూరు (అర్బన్): జిల్లాలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఇటు ప్రభుత్వ వైద్యశాలల్లోనూ, అటు ప్రైవేట్ వైద్యశాలల్లోనూ వైద్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మె బాట పట్టారు. మరో వైపు ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) ద్వారా ఉచిత స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్న నెట్ వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు తమ సేవలను ఆపేయడంతో సోమవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఏడాది కాలానికి పైగా కొండలా పేరుకు పోయిన తమ బకాయిలు రూ.2,700 కోట్లు విడుదల చేస్తేనే సేవలు కొనసాగిస్తామని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రకటించాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు నిలిపేయడంతో ప్రభుత్వ తీరును నిరసిస్తూ రోగులు ఇళ్లకు తిరిగి వెళ్లిపోతున్నారు.



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సమన్వయకర్త విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కందుకూరు: నకిలీ మద్యం తయారీపై కందుకూరు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు



వెంకటాచలం: కూటమి ప్రభుత్వ మద్యం విధానం, టీడీపీ నేతల దాష్టీకాన్ని నిరసిస్తూ వెంకటాచలంలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్వేపల్లి వైఎస్సార్‌సీపీ నేతలు

నకిలీ మద్యంపై కన్నెర్ర

ప్రజల ప్రాణాలతో టీడీపీ నేతల చెలగాటంపై ధ్వజం

- నారా సురాపానం గుట్టు సీబీఐతో తేల్చాలని డిమాండ్
- రూ.వేల కోట్లు దోచేశారంటూ ఆరోపణలు
- ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములు తొలగించాలని నినాదాలు
- పలు నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు, ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు
- వైఎస్సార్‌సీపీ ఉద్యమం నేపథ్యంలో భారీగా పోలీసుల మోహరింపు

నకిలీ మద్యం రక్కసిపై మహిళలు కన్నెర్ర చేశారు. నారా సురా పానం.. తాగితే చావడం ఖాయమంటూ నినాదాలు చేశారు. ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములు తొలగించాలంటూ పోరుబాట పట్టారు. టీడీపీ నేతలు నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ ధ్వజమెత్తారు. జిల్లాలోని నెల్లూరు రూరల్, నెల్లూరు నగరం, కోవూరు, సర్వేపల్లి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీలు, ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.వేల కోట్లు దోచేసిన నకిలీ మద్యం గుట్టు తేల్చాలంటూ డిమాండ్ చేశారు. నకిలీ మద్యాన్ని నిరోధించలేని పోలీసులు మాత్రం వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకునేందుకు ఎక్సైజ్ కార్యాలయాల వద్ద భారీగా మోహరించారు.



వైఎస్సార్‌సీపీ నిరసనల నేపథ్యంలో నెల్లూరు ఎక్సైజ్ స్టేషన్ ఎదుట పోలీసుల మోహరింపు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ నెట్‌వర్క్ : నకిలీ మద్యాన్ని వ్యవస్థీకృతం చేస్తూ కూటమి ప్రభుత్వం తెచ్చిన మద్యం విధానాలను, ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నేతల ధన దాహాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు గర్జించారు. పలు నియోజవర్గాల్లో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీలు నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. నకిలీ మద్యం తాగితే.. ప్రాణాలు పోవడం ఖాయమంటూ నిననాదాలు చేశారు. నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమగా మార్చేసి మద్యం ప్రియుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెడుతున్నారంటూ ధ్వజమెత్తారు. మద్యం షాపుల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిరోధించాలని నిరసనలు తెలిపారు. ఊరూరా బెల్టుషాపులు పెట్టి మద్యం విక్రయిస్తున్నా.. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. కళ్ల ముందు విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నా.. వారిచ్చే ముడుపులు తీసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ మండిపడ్డారు.



నెల్లూరు : నగర ఎక్సైజ్ స్టేషన్ ఎదుట మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి



కోవూరు: మహిళలతో కలిసి కోవూరులో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



నెల్లూరు రూరల్ పరిధిలో బీవీనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

ఎవరికీ తెలియకుండానే చేశారా?

ఏడాదికిపైగా నకిలీ మద్యం తయారు చేస్తూ.. లక్షల బాటిళ్ల బెల్టుషాపుల ద్వారా విక్రయాలు చేస్తుంటే పోలీస్, ఎక్సైజ్ వ్యవస్థలు ఏమి చేస్తున్నాయని నిలదీశారు. వీరికి తెలియకుండానే ఈ స్థాయిలో నకిలీ మద్యం తయారవుతుంటే అది ఈ రెండు వ్యవస్థలు సిగ్గుపడాలన్నారు. నకిలీ మద్యంతో రూ.వేల కోట్లు దోచేశారంటే ప్రభుత్వ పెద్దల సపోర్టు లేకుండానే చేయడం సాధ్యమా? అని నిలదీశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నకిలీ మద్యం మాఫియా బయట పడిందని, యథేచ్ఛగా నకిలీ మద్యం తయారీ చేస్తూ టీడీపీకి చెందిన నాయకుల పాత్ర ఆధారాలతో సహా రుజువైందన్నారు. రాష్ట్రంలో కుటీర పరిశ్రమలా కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి, ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటూ, సంపాదనే ధ్యేయంగా ఈ మాఫియా పని చేస్తోందన్నారు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న మద్యం దుకాణాలపై ఎటువంటి నియంత్రణ లేకుండా, లాటరీ పేరుతో మొత్తం మద్యం దుకాణాలను కూటమి పార్టీలకు చెందిన నాయకులకు కట్టబెట్టడంతో, గుడి, బడి అనే తేడా లేకుండా మద్యం దుకాణాలు, బెల్ట్ షాప్‌లను ఏర్పాటు చేసి, మద్యాన్ని తాగించడమే ఒక ఉద్యమంగా నడిపిస్తున్నారన్నారు. సీబీఐతో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే.. సిట్‌తో విచారణకు ప్రభుత్వం ఆదేశించడం చూస్తే కుట్రలు అర్థమవుతున్నాయన్నారు. నెల్లూరు నగరంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరురూరల్ పరిధిలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతోపాటు సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, కోవూరులో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నకిలీ మద్యం పోరుబాటలో పాల్గొన్నారు. సర్వేపల్లి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు.

వినూత్నంగా చాంపియన్ ఫార్మర్ విధానం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరురూరల్: ఆధునిక వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గిపోతున్న ఆదాయాల నేపథ్యంలో జిల్లాలో వినూత్నంగా చాంపియన్ ఫార్మర్ (వ్యవసాయ విజేతలు) అనే నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో వివిధ అంశాలపై సబ్‌కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలోని ఒక గ్రామంలో నెలలో ఒక రోజు సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. యానాదులు ఎక్కువగా ఉన్నందున వారికి అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. కేవలం భూ సంబంధ విషయాలే కాకుండా మిగిలిన అన్ని సమస్యలపై చర్చించాలన్నారు. మండల, డివిజనల్ స్థాయిలో పరిష్కారమయ్యే కేసులను జిల్లా కేంద్రం వరకు తీసుకురాకూడదన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి ఒక్క కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేయాలన్నారు. వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన వ్యవసాయ విధానంలో భాగంగా జిల్లాలోని 722 గ్రామ పంచాయతీల నుంచి ఔత్సాహిక రైతులను ఎంపిక చేసి వారిని వ్యవసాయ విజేతలుగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ విజయ్‌కుమార్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఎంపీపీ కుంపటి

- రెండు గ్రూపులుగా అధికార పక్షం
- ఎంపీపీపై అవిశ్వాసానికి మరో వర్గం ఆర్డీఓకు వినతి
- ఎమ్మెల్యే కాకర్ల మాట లెక్క చేయని వైనం

వింజమూరు(ఉదయగిరి): ఎంపీపీ పదవి కోసం అధికార పక్షంలో రాజకీయ కుంపటి రగులుతోంది. వనిపెంట సుబ్బారెడ్డి, ప్రస్తుత ఎంపీపీ ఇనగలూరి మోహన్‌రెడ్డి మధ్య కుర్చీ పోరు పీక్ స్థాయికి చేరింది. అధికార పక్షం రెండు వర్గాలుగా చీలిపోయి రచ్చకెక్కుతున్నాయి. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోరుతూ మరో వర్గం ఆర్డీఓకు వినతిపత్రం అందజేసింది. అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే కాకర్లను రెండు వర్గాలు లెక్కచేయడం లేదని తెలుస్తోంది. ప్రస్తుత ఎంపీపీ మోహన్‌రెడ్డి కుర్చీ వదలను అంటుండగా.. ఆ కుర్చీ నాదే ఎలా వదలవో తేలుస్తానంటూ సుబ్బారెడ్డి సవాల్ విసురుతున్నారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ఎంపీపీని గద్దె దించి తన సతీమణి హైమావతిని ఆ కుర్చీలో కొలువు తీర్చేందుకు సుబ్బారెడ్డి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

మొదటి నుంచి వివాదమే

గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆనాటి అధికార పార్టీలో ఎంపీపీ పదవి కోసం పోటీ ఏర్పడింది. ఒక వర్గానికి నాయకత్వం వహించిన మోహన్‌రెడ్డికి సుబ్బారెడ్డి సొంత ప్యానల్ ఏర్పాటు చేసుకొని ముగ్గురు ఎంపీటీసీలను స్వతంత్ర అభ్యర్థులుగా గెలిపించుకొని మోహన్‌రెడ్డిని ఎంపీపీ కుర్చీలో కూర్చొబెట్టేందుకు సహకారం అందించారు. అయితే అప్పు డు మూడేళ్లు మోహన్‌రెడ్డి, రెండేళ్ల సుబ్బారెడ్డి భార్య హైమావతి ఎంపీపీ పదవిలో ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య విబేధాలు రావడంతో ఒప్పందం అమలు జరగలేదు. ఈ క్రమంలో 2024 సాధారణ ఎన్నికల్లో ఇద్దరు టీడీపీ గూటికి చేరడంతో ఎంపీపీ మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి మధ్య పోరు తీవ్రమైంది. ఈ పంచాయితీ ఎమ్మెల్యే కాకర్ల వద్దకు చేరినా, ఈ సమస్య పరిష్కరించేందుకు చొరవ చూపలేదు. దీంతో ఈ నెల 31వ తేదీ అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు పావులు కదుపుతున్న నేపథ్యంలో అధికారులు నోటీసులు అందజేస్తున్నారు.

వాయిగుండ్ల వెంకట్ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన వాయిగుండ్ల వెంకట్‌కు శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక చిత్రపటాన్ని బహుకరిస్తున్న ఆలయ అధికారులు

నెల్లూరు(బృందావనం): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం దేవస్థానం ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా వర్ధ్యాసా లైఫ్ స్పేసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ వాయిగుండ్ల వెంకట్‌తో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్‌యాదవ్, కొలుసు పార్థసారథి హాజరయ్యారు. తమ సంస్థ అధినేతకు శ్రీశైలంలో భక్తులు సేవ చేసే అవకాశం లభించడంపై ఆ కంపెనీ సీజీఎంలు అభినవరాజు, సుధాకర్, సత్తార్, విజయకుమార్, కాంచన ప్రసాద్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు చెన్నై-నెల్లూరు మెమూ రైళ్ల రద్దు

నాయుడుపేటటౌన్: చెన్నై-నెల్లూరు మధ్య నడిచే మెమూ (నంబరు 66035, 66036) రైళ్లు మంగళవారం పూర్తిగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. తడ, సూళ్లూరుపేట ప్రాంతాల్లో రైల్వే లైన్ల మరమ్మతుల కారణంగా రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెమూ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

నిజాలు రాస్తే 'సాక్షి'పై కక్ష సాధింపా?

- విలేకరుల ఇళ్లల్లో సోదాలు చేయడం అప్రజాస్వామ్యం
- అర్ధరాత్రి పూట, తెల్లవారు జామున వెళ్లి నోటీసులా?
- నకిలీ మద్యం తయారు చేసింది నిజం కాదా?
- నీ గ్యాంగ్‌తో అమ్మించింది అబద్ధమా?
- వైఎస్సార్‌సీ పీఏసీ సభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ప్రజా సమస్యలతోపాటు అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెచ్చే విధంగా నిజాలు రాస్తే 'సాక్షి' పత్రికపై కక్ష సాధించడం విచారకరమని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాస్తవాలను రాసిన విలేకరుల ఇళ్లల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నారంటూ సోదాలు చేయడం, విచారణ పేరుతో అర్ధరాత్రి, తెల్లవారు జామున ఇళ్లకు వెళ్లి నోటీసుల పేరుతో అలజడి సృష్టించడం ఏమిటని ప్రసన్న ప్రశ్నించారు. చంద్రబాబూ.. మీ పార్టీ నేతలు నకిలీ మద్యం తయారు చేయడం నిజం కాదా? నీ గ్యాంగ్‌తో రాష్ట్రం మొత్తం విక్రయించింది అబద్ధమా? అని నిలదీశారు. ఇవే నిజాలు కాబట్టే మీ పార్టీ నేతలపై కేసులు పెట్టారు. ఇవన్నీ నిజాలు కాబట్టే 'సాక్షి' పత్రిక నకిలీ మద్యం వ్యాపారం గురించి, అది తాగి చనిపోయిన వారి గురించి వాస్తవాలు వెల్లడించిందని గ్రామాల్లో, పట్టణాల్లో విషపూరిత మద్యం వ్యాపారాలు ఎలా సాగుతున్నాయో ప్రజలకు చూపించింది. నిజాలను జీర్ణించుకోలేకనే.. విచారణ పేరుతో వేధింపులకు దిగుతుందని ధ్వజమెత్తారు. నకిలీ మద్యం తయారీకి కారణమైన పార్టీ నేతలతోపాటు పోలీసులు, ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవడం మాని, వాస్తవాలను రాసిన 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, జిల్లా బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డికి నోటీసులు జారీ చేయడం, మండల రిపోర్టర్ ఇంట్లో సోదాలు చేయడం మంచిది కాదన్నారు. నకిలీ మద్యం మాఫియాలు ఎవరి రక్షణలో పనిచేస్తున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ దుర్మార్గాన్ని బయట పెట్టిన పత్రికను బెదిరించడం అంటే ప్రజల గొంతును నొక్కడమే అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాల్గో స్తంభం. ఆ స్తంభాన్నే కూలగొట్టే ప్రయత్నం జరుగుతోందని ప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,424 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 27,872 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారిరిక 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని, కేటాయించిన సమయానికంటే ముందుగా వెళ్లిన వారికి క్యూలోకి అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరుబాట



కోటి సంతకాల సేకరణలో భాగంగా తొలి సంతకం పెడుతున్న ప్రసన్న

• మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఆ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే సీఎం చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనతో కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తున్నారన్నారు. ఎంబీబీఎస్ చదవాలంటే రూ.కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే, తమకొద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాసిన ఘనుడు చంద్రబాబు అని చెప్పారు. కూటమి ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిందని, ఆ డబ్బంతా ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.5 వేల కోట్లతో కళాశాలలకు జీవం వస్తుందన్నారు. వైద్య కళాశాలలు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీల బిడ్డలు వైద్య విద్య చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈనెల 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు జరుగుతాయన్నారు. పోరుబాటలో భాగంగా కోటి సంతకాల సేకరణతో పాటు దశల వారీగా నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు. యువత, మేధావులు, వామపక్షాలు తదితరులు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. రౌడీయిజం, దౌర్జన్యాలు చేస్తే జనం ఊరుకోరన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కొండూరు అనిల్‌బాబు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయకుమార్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు నరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సీనియర్ నాయకులు రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్లు అనూప్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శేషగిరిరావు, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

దూర ప్రాంతాల నుంచి తరలివచ్చి..

• కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
• 500 దాటిన అర్జీల సంఖ్య



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: 'అయ్యా చాలాదూరం నుంచి వచ్చాం. మా వినతులు పరిశీలించి న్యాయం చేయండి' అంటూ ప్రజలు అధికారులను కోరారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రికార్డు స్థాయిలో 505 అర్జీలు వచ్చాయి. అందులో అధికంగా రెవెన్యూ శాఖవి ఉన్నాయి.

చర్యలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న యానాది సంక్షేమ సంఘం నాయకులు

కండలేరు జలాశయంలో అక్రమంగా చేపల వేట సాగిస్తూ యానాదుల పొట్టకొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ కొందరు ముఠాగా ఏర్పడి చేపల వేట సాగిస్తున్నట్లు ఆరోపించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, వెంటనే చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ జేడీని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానికల మురళి, చెంబేటి ఉష, బిట్రా ప్రసాద్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నేతలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ మాదిగ, ఉపాధ్యక్షుడు ఉదయకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలంటూ..



మాట్లాడుతున్న రేవతి, రెహానా బేగం

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలను వెంటనే విడుదల చేయాలంటూ ఆ యూనియన్ అధ్యక్షురాలు తుమ్మారెడ్డి రేవతి, కార్యదర్శి రెహానా బేగం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో భోజనం పెట్టడం కష్టమవుతోందన్నారు. సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

జీతాలు అందించాలి



మాట్లాడుతున్న రవికుమార్

జిల్లాలో సీహెచ్‌సీల్లో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి ఆరునెలలుగా జీతాలు అందడం లేదంటూ ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చేమూరు రవికుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఫస్ట్ ఆబ్జెక్ట్ అనే సంస్థ టెండర్ దక్కించుకుందన్నారు. ఇది ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బినామీగా తెలుస్తోందన్నారు. పలుమార్లు జిల్లా అధికారులను సంప్రదించిన ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో సురేఖ, కీర్తి, మౌనిక, సుమ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు



పోకూరు కోటయ్య

తమకు పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని కొందరు బెదిరించి ఆక్రమించారని వలేటి వారిపాళెం మండలం తూర్పు పోలినేనిపాళెం గ్రామస్తులు పోకూరు కోటయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తాను పుట్టు మూగవాడినని, భార్యకు పక్షవాతం వచ్చిందని అర్జీలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, కొండయ్య, సింహాద్రి, పాపారావు, సింగయ్య, ముసలయ్య మమ్మల్ని కొట్టి భూమిని ఆక్రమించినట్లు చెప్పారు. కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. వీఆర్వో, సర్వేయర్ తప్పుడు రిపోర్టులు ఇచ్చారన్నారు. ఎస్సై దగ్గరికి వెళితే స్టేషన్ పరిధిలో కనిపిస్తే జైల్లో వేస్తానని చెప్పారన్నారు. రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

వేలం నిర్వహించకుండానే..



మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

బహిరంగ వేలం నిర్వహించకుండా విష్ణు ఆలయానికి సంబంధించిన టేకుతో సహా దాదాపు రూ.40 లక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అమ్ముకున్నారని తోటపల్లిగూడూరు మండలం వరిగొండ గ్రామానికి చెందిన గండవరపు వెంకటరామిరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ జ్వాలాముఖి దేవస్థానం చైర్మన్ భర్త కోడూరు శ్రీనివాసులురెడ్డి అలియాస్ బాబిరెడ్డి ప్రజలను భయపెట్టి టేకుతో తయారుచేసిన తలుపులు, కిటికీలు, చెక్కలు తదితరాలు అమ్ముకుని దోచేస్తున్నారన్నారు. ఈఓ తాతా శ్రీనివాసరావు చిన్న ఘటనలపై ప్రజలపై కేసులు పెడుతుంటారని, కుంభకోణం జరిగినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

• రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



పద్మనాభరెడ్డి (ఫైల్)

కావలి(అల్లూరు): రోడ్డు ప్రమాదంలో కావలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలవల్లి పద్మనాభరెడ్డి (58) మృతిచెందిన ఘటన ముంగమూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడైన పద్మనాభరెడ్డి వైఎస్సార్‌సీపీలో కీలకంగా ఉన్నారు. అల్లూరు నుంచి పద్మనాభరెడ్డి, రామకోటారెడ్డి మోటార్‌బైక్‌పై బయలుదేరారు. కొంత దూరం వెళ్లి యూటర్న్ తీసుకుంటున్న తరుణంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. స్థానికులు వెంటనే వారిని నెల్లూరు అపోలో ఆస్పత్రికి తరలించగా పద్మనాభరెడ్డి మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రామకోటారెడ్డికి కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్:	రూ.218
స్కిన్‌లెస్ చికెన్:	రూ.240
లేయర్ చికెన్:	రూ.207

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.30
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.10

పిల్లలకు అండగా ఉంటాం

• సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(అర్బన్): బాలభవిత (అర్లీ ఇంటర్‌వెన్షన్) కేంద్రంలోని పిల్లలకు అండగా ఉంటామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ పుట్టుకతో లోపాలున్న వారికి, గ్రహణమొర్రి, గ్రహణశూల, సకాలంలో మాట్లాడలేకపోవడం, వినలేకపోవడం సమస్యలున్న పిల్లలకు కేంద్రం అండగా ఉంటుందన్నారు. పిల్లలకు గుండె ఆపరేషన్లు, రూ.లక్షల విలువ చేసే కాక్‌టెయిల్ ఇంప్లాంట్ ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయిస్తున్నారన్నారు. పిల్లలకు ఏమి అవసరమైనా సంస్థ తరఫున అండగా ఉంటామన్నారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 15100 ద్వారా తమను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ యశ్వంత్, చిన్నపిల్లల డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ పావని, మేనేజర్ జమీర్, పారా లీగల్ వలంటీర్ శ్రీనివాసులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం వేధింపులు

• పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన బాధితులు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ అజిత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆస్తి కోసం పిల్లలు వేధిస్తున్నారని పలువురు వృద్ధులు ఫిర్యాదు చేశారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 125 మంది విచ్చేసి ఫిర్యాదులను ఎస్పీ అజితకు అందజేశారు. ఆమె స్వయంగా అర్జీదారుల వద్దకెళ్లి మాట్లాడారు. న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- నా వయసు 73 సంవత్సరాలు. చిన్న కుమారుడు బాగోగులు పట్టించుకోవడం లేదు. ఇంటికి తాళం వేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నాడని ఆత్మకూరు ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశాడు.
- నాకు పిల్లల్లేరు. సోదరి కుమారుడైన కాకర్ల పెంచలయ్యను పెంచాను. అతను నా ఇల్లు, ఆస్తి ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చేజర్ల ప్రాంతానికి చెందిన 85 సంవత్సరాల వృద్ధుడు వినతిపత్రమిచ్చాడు.
- టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి బిట్‌కాయిన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. అతడికి రూ.6 లక్షలు పంపాను. ఇప్పుడు స్పందించడం లేదని ఇందుకూరుపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వెల్లడించాడు.
- పుత్తూరు ప్రాంతానికి చెందిన హేమంత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.4.50 లక్షలు తీసుకుని మోసగించాడని రాపూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- తన కుమార్తె ఆగస్టు నెల నుంచి కనిపించడం లేదని, ఆచూకీ కనుక్కోవాలని నెల్లూరు నగరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- భర్త, అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. భర్త మద్యం తాగొచ్చి ఇంట్లో బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని, కౌన్సెలింగ్ చేసి కాపురాన్ని చక్కదిద్దాలని కందుకూరు ప్రాంతానికి చెందిన ఓ మహిళ వినతిపత్రం అందజేసింది.
- భర్త చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. దగదర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. భర్తతో కలిసి మరిది బెదిరిస్తున్నాడు. నా కుమారుడిని తీసుకెళ్లేందుకు అత్త ప్రయత్నిస్తోంది. రక్షణ కల్పించాలని దగదర్తి ప్రాంతానికి చెందిన ఓ మహిళ వేడుకుంది.

17న విద్యార్థులకు పోటీలు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 17వ తేదీన పల్లిపాడులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో క్వాంటం ఏజ్ బిగిన్స్ – పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజెస్ అనే అంశంపై జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష, క్విజ్ పోటీలు తదితరాలు నిర్వహించి విజేతల్ని ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థులు 5 చార్ట్‌లు/స్లైడ్స్ ఉపయోగించుకుని 6 నిమిషాలపాటు ప్రెజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఒక పాఠశాల నుంచి ఒకరు మాత్రమే హాజరుకావాలన్నారు. ప్రతిభ చూపిన ఇద్దరిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వీరు ఈనెల 18న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు ఈనెల 30న బెంగళూరులో జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పేర్ల నమోదు కోసం ఈనెల 16వ తేదీలోపు జిల్లా సైన్స్ అధికారి 93471 21712 ఫోన్ నంబర్‌కు వివరాలు వాట్సాప్ చేయాలన్నారు.

విగతజీవులుగా జీజీహెచ్‌కు చేరి..

వారంతా జీజీహెచ్‌కు బయలుదేరారు. శుభ్రం చేసిన దుప్పట్లను అక్కడ అప్పగించాలి. కానీ విధి మరోలా తలచింది. వృత్తిలో భాగంగా జీజీహెచ్‌కు చేరాల్సిన వారిలో ఇద్దరు చనిపోయి మృతదేహాలుగా వెళ్లడం అందరినీ కన్నీరు పెట్టించింది. రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

• పెద్దాస్పత్రిలో దుప్పట్లు అప్పగించేందుకు వెళ్తుండగా.. • రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



ఘటనా స్థలంలో వాహనాలు





మన్సూర్, సురేష్‌రెడ్డి మృతదేహాలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నెల్లూరు ప్రశాంతి నగర్ జంక్షన్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగింది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోవూరు లారీ యార్డు సమీపంలోని ఇంద్రలోక్ అవెన్యూలో ఎస్కే మస్తాన్‌వలీ, అతని కుమారుడు మన్సూర్ (28) నివాసముంటున్నారు. వీరు నగరంలోని హోటళ్లు, హాస్పిటళ్లలోని దుప్పట్లు, ఇతర దుస్తులను శుభ్రం చేయించి తిరిగి అప్పగిస్తుంటారు. వీరి వద్ద విడవలూరు మండలం ఊటుకూరు ప్రాంతానికి చెందిన సురేష్‌రెడ్డి (49) డ్రైవర్‌గా, బిహార్‌కు చెందిన అక్రమ్, అనిల్, షమీమ్ పని చేస్తున్నారు. శుభ్రపరిచిన దుప్పట్లను బొలెరో ట్రక్కులో పెట్టుకుని సురేష్ రెడ్డి, మన్సూర్, అక్రమ్, అనిల్, షమీమ్‌లు జీజీహెచ్‌కు బయలుదేరారు. ప్రశాంతనగర్ జంక్షన్ వద్ద కావలి నుంచి చెన్నైకు మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ ఆ ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రక్కు ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మన్సూర్‌తోపాటు డ్రైవర్ సురేష్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చొని ఉన్న అక్రమ్ తీవ్రంగా, అనిల్ స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సై బలరామ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మన్సూర్‌కు భార్య, ఇద్దరు సంతానం, సురేష్‌రెడ్డికి భార్య, పిల్లలున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ స్తంభించగా పోలీసులు పునరుద్ధరించారు.

రోడ్డు దాటుతుండగా..

• కారు ఢీకొని వ్యక్తి మృతి



కొండల్‌రావు మృతదేహం

వెంకటాచలం: రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కాకుటూరు వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కాకుటూరు గ్రామానికి చెందిన కొండలరావు (47) విక్రమ సింహపురి యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డు పనిచేస్తున్నాడు. పని నిమిత్తం తన నివాసం నుంచి జాతీయ రహదారి దాటుతుండగా గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. కొండలరావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.